మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన వెంకటయ్య

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సన్మానిసున్న బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటయ్య

యాదగిరిగుట్ట, అక్టోబర్ 24 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, మల్లాపురం మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను సన్మానించారు. ఆయన వెంట నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 24 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు గౌడ్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరుతూ గురువారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు తప్ప.. కొనుగోళ్లు చేయడం లేదన్నారు. వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. 40 కిలోల బస్తాకు 42 కిలోల తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, బస్తాకు బస్తా లేదా 750 గ్రాములు అదనంగా తూకం వేయాలని అన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వెంటనే పత్తి కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంగ నర్సింహులు, సంస్థాన్ నారాయణపురం పీఏసీఎస్ చైర్మన్ దోడ యాదిరెడ్డి, నాయకులు దోనూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ వైస్ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలి : బీఆర్‌ఎస్

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్

ఆలేరు టౌన్, అక్టోబర్ 24 : ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా నియామకమైన ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, జిల్లా నాయకుడు కందుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోని వ్యక్తిని ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ ఎన్నికలో ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు మండలాలకు అన్యాయం వాటిల్లిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన ప్రిలిమినరీ జీఓ 43ను అమలుపర్చి మోటకొండూరును ప్రత్యేక మార్కెట్ కమిటీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో వైస్ చైర్మన్ ఎన్నిక రద్దు చేసి, మోటకొండూర్ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైస్ చైర్మన్ పదవిని రక్షించుకునేందుకు ఆలేరు మార్కెట్ పరిధిలో లేని భూమిని మోటకొండూరు తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గ్యాదపాక నాగరాజు, ఆరె రాములు, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, పాండరి, శివ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌ను తొలగించాలి

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ పరమేశ్

తుర్కపల్లి, అక్టోబర్ 24 : ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్‌ను పదవి నుంచి తొలగించాలని బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామవాసిని ఆలేరు వైస్ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా ఎంపిక చేసిన వైస్ చైర్మన్‌ను వారం రోజుల్లోపు తొలగించి ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల వారికి పదవి ఇవ్వాలని కోరారు. లేదంటే రైతులతో కలిసి మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి తలారి శ్రీనివాస్, నాయకులు కనకయ్య, సత్తయ్య, మల్లేశ్, బాబు పాల్గొన్నారు.

పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ రమేశ్‌కు సత్కారం

రమేశ్‌ను సన్మానిస్తున్న చేనేత కార్మికులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 24 : పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయం రజతోత్సవంలో గురువారం చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ రమేశ్‌ను చేనేత కార్మికులు సత్కరించారు. ఈ సందర్భంగా బీద చేనేత కార్మికులకు చేనేత పొదుపు పథకం (త్రిఫ్ట్) కోసం ఐదుగురు చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందజేశారు. టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, జిల్లా గౌరవాధ్యక్షుడు వేషాల మురళి, మార్కండేశ్వర దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్ది సభకు తరలిన పీడీఎస్‌యూ నాయకులు

హైదరాబాద్‌కు బయల్దేరుతున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 24 : ఉస్మానియా యునివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభకు పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీడీఎస్‌యూ వ్యవస్థాపకులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఆశయాలను సాధించాలన్నారు. విద్యార్థి సమస్యలపై పోరాటం చేసేది పీడీఎస్‌యూ మాత్రమేనని పేర్కొన్నారు. సభకు తరలిన వారిలో బేజాడి కుమార్, గడ్డం నాగరాజు, ఆర్.ఉదయ్, మామిడాల ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్, సహదేవ్, సిద్దేశ్వర్, శ్రీకాంత్, శ్రీను, మధు, వెంకటేశ్, కృష్ణ ఉన్నారు.

గుట్టలో వైభవంగా సువర్ణ పుష్పార్చన

సువర్ణమూర్తులకు హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖ మండపంలో గురువారం సువర్ణమూర్తులకు పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తరనామాలు పఠిస్తూ అర్చించారు. భక్తులు సువర్ణ పుష్పార్చనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాత గుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.12,52,664 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లసింగారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, అక్టోబర్ 24 : రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, డీసీఓ ఎం.శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు, తాళ్లసింగారంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యంలో తాలు, రాళ్లు, మట్టిపెడ్డలు లేకుండా, తేమ శాతం 17లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరికృష్ణ, ఏఓ ముత్యాల నాగరాజు, ఏఎంసీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు బోరెం నర్సిరెడ్డి, పబ్బతి వెంకటేశం, దొడ్డి శ్రీశైలం, దుబ్బాక శశిధర్ రెడ్డి, గుండెబోయిన రూపమ్మ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 24 : మండలంలోని మల్కాపురం గ్రామంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం జనగామ గ్రామానికి చెందిన చుక్కా రాజు (38) డ్రైవర్‌గా పని చేస్తూ చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తుర్కపల్లి, అక్టోబర్ 24 : బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన సొన్నాయిల గణేశ్ (25) గురువారం బైక్‌పై గ్రామం నుంచి మాదాపురం వైపు వెళ్తున్నాడు. మాదాపురం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దాంతో తీవ్రగాయాలైన గణేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కూరెళ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 24 : మండలంలోని కూరెళ్ల, పుల్లాయిగూడెం, పల్లెర్ల, లింగరాజుపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంధమల్ల జహంగీర్, డైరెక్టర్లు పుట్ట నిర్మల, మల్లమ్మ, శ్రీరాములు, యాదయ్య, భిక్షపతి, నరేశ్, సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా నర్సింహ బాధ్యతలు

గుండాల, అక్టోబర్ 24 : విద్యుత్ శాఖ ఏఈగా అంబాల నర్సింహ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా రాజాపేట ఏఈగా పనిచేసిన అంబాల నర్సింహ గుండాలకు రాగా.. ఇక్కడ విధులు నిర్వహించిన భరత్ యాదగిరిగుట్టకు బదిలీపై వెళ్లారు. ఆయనతోపాటు లైన్ ఇన్‌స్పెక్టర్ కూరాకుల అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను విద్యుత్ ఉద్యోగులు సన్మానించారు.

బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు : డీసీపీఓ

- తుర్కపల్లి మండలంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

తుర్కపల్లి, అక్టోబర్ 24 : బాల్య వివాహం జరిపినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు ఉంటాయని డీసీపీఓ సైదులు అన్నారు. మండలంలో బాల్య వివాహం జరిపిస్తున్నారని సఖి కేంద్రానికి అందిన ఫిర్యాదు మేరకు గురువారం డీసీపీఓ, ఐసీడీఎస్, ఐసీపీఎస్, సఖి కేంద్రం సభ్యులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. పెండ్లి చేయబోయే బాలిక, వారి తల్లిదండ్రులను భువనగిరి సఖి కేంద్రానికి తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. 18సంవత్సరాలు నిండే వరకు అమ్మాయికి వివాహం చేయవద్దన్నారు. ఒకవేళ పెండ్లి జరిపిస్తే పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జయశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విద్యారాణి పాల్గొన్నారు.

పాల బిల్లులు 15రోజులకోసారి చెల్లించాలి

- మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వినతి

మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పాల సొసైటీ చైర్మన్లు

రాజాపేట/ ఆలేరు టౌన్, అక్టోబర్ 24 : పాడి రైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులను 15 రోజులకోసారి వచ్చేలా చూడాలని ఆలేరు నియోజకవర్గంలోని పాల సొసైటీల చైర్మన్లు కోరారు. హయత్‌నగర్‌లో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల ధరను తగ్గించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అందుకు చైర్మన్ సానుకూలంగా స్పందించి పాడి రైతుల సంక్షేమానికి పాటుపడుతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాల సొసైటీ చైర్మన్లు సందిల భాస్కర్‌గౌడ్, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒగ్గు భిక్షపతి, సతీశ్‌రెడ్డి, రంగయ్య, వెంకటేశ్, రామిడి బాబురెడ్డి, బీదర బోయిన రవి, నాగరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

భూమి లేకున్నా మ్యుటేషన్‌కు యత్నం!

- తాసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని యాదగిరిపల్లి వాసుల ధర్నా

తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యాదగిరిపల్లి గ్రామస్తులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 24 : భూమి లేకున్నా అక్రమంగా మ్యుటేషన్ చేసి శ్మశాన వాటిక, దోబీఘాట్‌ను కబ్జా చేసేందుకు కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు యత్నిస్తున్నారని యాదగిరిపల్లి గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. సదరు సర్వే నంబర్‌లో భూమి లేకున్నా మరో ఎకరంన్నర భూమిని కలిపి రియల్ వ్యాపారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు తాసీల్దార్ యత్నిస్తున్నారని మండిపడ్డారు. తాసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని గురువారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట యాదగిరిపల్లి వాసులు ధర్నాకు దిగారు. మ్యుటేషన్‌ను నిలిపివేసి శ్మశానవాటిక, దోబీఘాట్‌ను కాపాడాలని కోరారు. పట్టణంలోని యాదగిరిపల్లిలో సర్వే నంబర్ 152లో రవీందర్‌రావుకు చెందిన భూమిలో సుమారు 60ఎకరాల భూమి ఆయన వద్ద పనిచేసే వేముల రాజయ్యకు ఇచ్చాడు. రాజయ్య కుమారులైన వేముల లక్ష్మీనర్సయ్య, రామకృష్ణ, ప్రకాశ్ తలా 20 ఎకరాలు పంచుకున్నారు. ఇదే సర్వే నంబర్‌లో 50 ఏండ్ల క్రితమే రవీందర్‌రావు కుటుంబ సభ్యులు పూసలి, ముదిరాజ్ కులస్తుల శ్మశాన వాటికకు, రజకులకు దోబీఘాట్ కోసం 10 గుంటల చొప్పున విరాళంగా ఇచ్చారు. అక్కడ పూసలి సంఘం భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. రజకులు దోబీఘాట్ నిర్మించుకుని పనులు సాగిస్తున్నారు. కాగా, వేముల రామకృష్ణ వద్ద సుమారు 4.20 ఎకరాల భూమిని 1995లో దండు విజయలక్ష్మి కొనుగోలు చేశారు. ఆమె తన భూమిని 1999లో సందీప్‌కుమార్‌కు 20 గుంటలు, నాగరాజు నాయుడుకు 4, దాసు గౌడ్‌కు 16గుంటలు, మారెడ్డి మంగమ్మకు 3.20 ఎకరాలు విడివిడిగా విక్రయించారు. దాంతో 152 సర్వే నంబర్‌లో దండు విజయలక్ష్మికి భూమి లేకుండా పోయింది. పొరపాటో లేక రియల్ వ్యాపారులు కుమ్మక్కై చేశారో కానీ.. ధరణిలో దండు విజయలక్ష్మి పేరిట 2.02 ఎకరాల కనిపిస్తున్నది. ఆ భూమిని కొనుగోలు చేస్తామని రియల్ వ్యాపారులు విజయలక్ష్మికి తెలిపారు. ఈ క్రమంలో ఆమె పేరిట ధరణిలో చూపిస్తున్న 2.02 ఎకరాల భూమిని కొంత మంది రియల్ వ్యాపారస్తుల పేరిట మ్యుటేషన్ చేసినట్లు సమాచారం. 50 ఏండ్లుగా కొనసాగుతున్న శ్మశానవాటిక, దోబీఘాట్‌ను కబ్జా చేసేందుకు రియల్ వ్యాపారులు ప్రయత్నం చేస్తున్నారని యాదగిరిపల్లి గ్రామస్తులు తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. విజయలక్ష్మి పేరిట 2.02ఎకరాల భూమి ఎలా వచ్చిందో తాసీల్దార్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, ఆర్డీఓలకు విడివిడిగా వినతి పత్రాలు పంపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యాను వివరణ కోరగా.. 152 సర్వే నంబర్‌లోని పట్టా భూమిలో శ్మశానవాటిక, దోబీఘాట్ ఉన్నాయని ఆర్‌ఐ సర్వేలో తేలిందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకుంటే విచారణ చేపట్టామే తప్ప.. మ్యుటేషన్ పూర్తి చేయలేదని చెప్పారు. పట్టా భూమిలో పట్టాదారు అనుమతి లేకుండా శ్మశానవాటిక, దోబీఘాట్ నిర్మించడం చట్టవిరుద్ధమన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా ధర్నా చేయమేంటని గ్రామస్తులను ఉద్దేశించి తాసీల్దార్ పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత

మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు అందజేసిన మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత

రాజాపేట, అక్టోబర్ 24 : గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాలో మంచినీటి సరఫరా సహాయకులు మెరుగైన సేవలు అందించాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామీణ మంచినీటి సహాయకులకు శిక్షణలో ఆమె మాట్లాడారు. నీటి సరఫరాలో ఏర్పడే సమస్యలను ఎలా అధిగమించాలో అవగాహన కల్పించారు. నీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్యాంకులను నెలకు మూడు సార్లు కచ్చితంగా కడగాలని, రోజూ క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ పద్మావతి, ఏఈ వెంకటరమణ, ఎంపీడీఓ నాగవేణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ

నాగినేనిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం, అక్టోబర్ 24 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని డీఈఓ కె.సత్యనారాయణ అన్నారు. మండలంలోని నాగినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఏ 1 పరీక్షలు, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ కమిటీ పనులు, పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడానికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి దిక్సూచి వంటివని, వాటిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రోజారాణి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి భాగ్యమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పి.యాదయ్య

బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, నోటు పుస్తకాలు అందజేస్తున్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, వార్డెన్ సునీల్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 24 : ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పి.యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేసిన దుప్పట్లు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెను ప్రకారం పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందివ్వాలని సూచించారు. ఆయన వెంట హాస్టల్ అధికారులు సునీల్, స్వప్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : సీఐ

సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 24 : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ సురేశ్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెల్‌ఫోన్ వాడకం, సైబర్ నేరాలపై ఆయన వివరించారు. నేటి సమాజంలో విద్యార్థులు సామాజిక మాధ్యమంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని, సెల్‌ఫోన్‌ను అవసరానికి మించి వాడుతున్నారని అన్నారు. సెల్‌ఫోన్ వాడకంతో అనేక ఇబ్బందులు ఉన్నాయని, ఫోన్ వాడుతున్న క్రమంలో డబ్బులు పోగొట్టుకోవడం పెరుగుతున్నాయని తెలిపారు. అత్యాశకు పోయి త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించాలని ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి ఆస్తులను పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే 1930 క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సంచార జాతులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి'

ఎంబీసీ చైర్మన్ జయపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న మందుల పోరాట హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 24 : సంచార జాతులకు రాజకీయ ప్రాధాన్యతతోపాటు ఎలాంటి రుసుము లేకుండా పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని మందుల పోరాట హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మందుల రవి అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎంబీసీ చైర్మన్ జరీపెట్టి జయపాల్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. స్వతంత్ర్య భారతంలో సంచార జాతులకు రిజర్వేషన్లు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సంచార జాతులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, గుర్తింపు ఇవ్వాలని కోరారు.

మెజీషియన్ నితిన్‌కుమార్‌కు సన్మానం

ఆలేరు టౌన్, అక్టోబర్ 24 : ఇటీవల కేరళ రాష్ట్రంలో నిర్వహించిన ఆల్ ఇండియా మ్యాజిక్ కాంపిటిషన్ పోటీల్లో జిల్లా స్థాయిలో నేషనల్ చాంపియన్ అవార్డు అందుకున్న ఆలేరు పట్టణానికి చెందిన కటకం నితిన్‌కుమార్‌ను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం ఆలేరు పట్టణ అధ్యక్షుడు పాశికంటి శ్రీనివాస్ ఆయనకు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఆడెపు బాలస్వామి, బేతి రాములు, చిక్క శ్రవణ్, కటకం వెంకటేశం, గుజ్జ అశోక్, కందగట్ల నరేందర్, బోగ సంతోష్, బడుగు జహంగీర్, రాజు, పురుషోత్తం, సత్యనారాయణ పాల్గొన్నారు.